క్లుప్తంగా

సహాయక చర్యలు చేపట్టండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నిర్వాసితులుగా మారుతున్న ప్రజలకు సహాయ చర్యలు, పునరావాస ఏర్పాట్లలో అలసత్వం వద్దని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడానికి హైదరాబాద్‌కు వెళ్లిన కూనంనేని అక్కడి నుంచి ఆదివారం ఫోన్ ద్వారా వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ముంపు ప్రాంతాలలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని చెప్పారు. విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నిర్వాసిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు.

మట్టి గణేష్ ప్రతిమలనే వాడాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఓ గన్యానాయక్, చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు

పాల్వంచ: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే వినాయక చవితికి మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించుకోవాలని కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.గన్యానాయక్, శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ ఎన్.సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కేఎస్‌పీ రోడ్‌లోని అక్షయ మోటర్స్ ఈ బైక్ షోరూం నందు గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకుడు రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఉచిత వినాయక మట్టి ప్రతిమల కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా మట్టి ప్రతిమల పంపిణీ చేపట్టడం అభినందనీయం అన్నారు. రాథోడ్ మాట్లాడుతూ.. 6వ తేదీన వెయ్యి ప్రతిమలు, పూలు, పండ్ల మొక్కలను అక్షయ్య ఏడీఎంఎస్ షోరూం వద్ద పంపిణీ చేస్తామని, పట్టణ, మండల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వికాస తరంగిణి నిర్వహకురాలు రోజా, తేజ, మోహన్, బి.సురేష్, తేజావత్ వెంకట్, చిరంజీవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు..



మాట్లాడుతున్న ఎస్ఐ రాణా ప్రతాప్

జూలూరుపాడు: భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రజలు వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదని జూలూరుపాడు ఎస్ఐ బి.రాణాప్రతాప్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. అల్పపీడనం ప్రభావంతో మరో మూడు రోజులు అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసరమైతేనే ఇళ్లలో నుంచి బయటకు రావాలని ప్రజలకు సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకల్లో చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమన్నారు. శిథిలమైన, దెబ్బతిన్న, మట్టి గోడల ఇళ్లు, పూరిగుడిసెలు, పాకల్లో నివసించే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలను తాకకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. వాగులు, వంకలు దాటకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా ఆపదలో ఉంటే తక్షణమే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

విషజ్వరాల నుంచి ప్రజలను రక్షించాలి



మాట్లాడుతున్న కనకయ్య

సింగరేణి(కొత్తగూడెం): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న బారీవర్షాల వలన నష్టపోయిన ప్రజలను, విషజ్వరాల బారిన పడిన బాధితులను కాపాడాలని, గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంత ప్రజలు స్వరం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి రక్షణ కల్పించాలని కోరారు. అదేవిధంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, కే.బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, భుక్యా రమేష్ పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని వరద బీభత్సం



టేకులపల్లి: పెట్రాంచెలక గ్రామంలో వాగు ఉధృతి



పాల్వంచరూరల్: కోతకు గురైన ఉల్వనూరు ప్రధాన రహదారి



ఇల్లెందురూరల్: రఘుబోయినగూడెం చెరువు అలుగు దాటుతున్న ప్రజలు



చుంచుపల్లి: పెనుబల్లి వాగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ కృష్ణ

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి భారీ వర్షం కురుస్తోంది. దీంతో చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. జనజీవనం స్తంభించింది. గ్రామాల పరిధిలోని చెరువులు మత్తడి పోస్తున్నాయి, వాగులు పొంగటంతో రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. లో-లెవల్ చప్టాలు నీట మునగటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల రోడ్లు పూర్తిగా తెగిపోయాయి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ చర్యలు చేపట్టారు. వాగుల వద్ద ఇరువైపులా ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు అడ్డుగా పెట్టి రక్షణ చర్యలు తీసుకున్నారు. కొన్నిచోట్ల వంతెనపై వరదనీరు ప్రవహిస్తున్నా.. హెచ్చరిక బోర్డులు, జాగ్రత్తలు సూచించే వారు లేక ప్రజలు ప్రమాదకరంగా వంతెన మీదుగా ప్రయాణిస్తున్నారు. వాహనదారులు, స్థానికులు ఇంతకు ముందెన్నడూ లేనంత తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇల్లెందు పట్టణానికి మంచినీటిని అందించే ఇల్లెందులపాడు మంచినీటి చెరువు మత్తడి దుంకింది. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: ఇల్లెందు మంచినీటి చెరువు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్, వీసీ



ఇల్లెందు: మత్తడి పోస్తున్న ఇల్లెందు మంచినీటి చెరువు



సుజాతనగర్: అలుగుపారుతున్న సింగభూపాలెం చెరువు



పాల్వంచ: బీసీఎం రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టు



జూలూరుపాడు: కాకర్ల ఎదళ్లవాగు బ్రిడ్జీ వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు



కరివారిగూడెంలో నీటమునిగిన వరి పొలాలు



అన్నారుపాడు అలుగు వాగు చప్టా వద్ద..



చుంచుపల్లి: మూలుగ్గూడెం వాగు వైపు ప్రజలు రాకుండా ట్రాక్టర్ అడ్డు పెట్టిన అధికారులు



కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డలో కోతకు గురైన రోడ్డు





పాల్వంచరూరల్: రంగాపురం నుంచి నాగారం రోడ్డు, సూరారం వద్ద బూడిద వాగు





ఇల్లెందురూరల్: మిట్టపల్లి గ్రామం వద్ద వైకుంఠధామం.., అన్నారం ప్రభుత్వ పాఠశాల



ఉధృతంగా ప్రవహిస్తున్న మసి వాగు



టేకులపల్లి: శంభునిగూడెంలో.. పత్తి పంట



రోళ్లపాడు మార్గంలో వాగు ఉధృతి



వరద నీటిలో కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రం



పాల్వంచ: గోవర్ధనగిరి కాలనీలో...



పాల్వంచరూరల్: ఉల్వనూరు గ్రామంలో సామగ్రి సర్దుకుంటున్న బాధితులు

ఫొటోగ్రాఫర్లకు ఐడీ కార్డుల పంపిణీ



ఐడీ కార్డులతో ఫొటోగ్రాఫర్లు

టేకులపల్లి: ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేయాలని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆమెడ రమేష్, ఆమెడ దామోదర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లిలోని సేవాలాల్ ఆలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని 44 మంది ఫొటోగ్రాఫర్లకు నూతన గుర్తింపు కార్డులను అందజేశారు. అదేవిధంగా 44 మంది పేర్లతో డ్రా తీయగా 17 మంది విజేతలుగా నిలిచారు. ఒక్కొక్కరికి 10,000 చొప్పున 1,70,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈసం రాజేశ్వరరావు, రవికుమార్ భూక్యా, సైదులు, అలవల శ్రీనివాస్, రమేష్, నాగు, రవికుమార్, శ్రీకాంత్, రాజీవ్, అరుణ్, కిట్టు, నవీన్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మందేరకలపాడు గ్రామ సమీపంలో రోడ్డును పరిశీలిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి



కిన్నెరసానిలో వరద భాదితులతో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచరూరల్: భారీవర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి కోరారు. ఆదివారం కిన్నెరసానిలో వరద ముంపునకు గురైన నివాసాలను, మందేరకలపాడు గ్రామం వద్ద గండిపడిన రహదారిని ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, జలాశయాలు నిండి పొంగిపొర్లుతున్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలోఉన్న, పాత ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. కరెంట్ స్తంభాలు, విద్యుత్ పరికరాలను తాకవద్దన్నారు. ఎక్కడైనా చెట్లు విరిగిపడినా, విద్యుత్ వైర్లు తెగినా, విద్యుత్ పోల్స్ విరిగిపడినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలకు ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు రహదార్లను గమనించుకుంటూ జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు.

పేదలను ఆదుకోవాలి... వరద ముంపు కారణంగా నష్టపోయిన పేదప్రజలను, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కిన్నెరసాని గేట్లు ఎత్తివేయడం ద్వారా వరద ముంపునకు గురైన కిన్నెరసాని గ్రామాన్ని ఆదివారం పాషా సందర్శించారు. కిన్నెరసాని ప్రాజెక్ట్ వరద కారణంగా ఇళ్లల్లోకి వరద చేరడంతో నిరాశులైన ప్రజలను, ఉల్వనూరు గ్రామంలో సర్వం కోల్పోయిన పేదలను అన్ని విధాలుగా ఆదుకోవాలని విన్నవించారు. ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, వేములపల్లి శ్రీను, శనిగారపు శ్రీనువాసరావు, లాల్‌పాషా, గిరి పాల్గొన్నారు.

ఉల్వనూరు గ్రామంలో...

ఉల్వనూరు గ్రామాల్లో వరద ముంపునకు గురైన నివాసాలను ఆదివారం మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు సందర్శించి పరామర్శించారు. మాట్లాడుతూ.. భారీవర్షంకారణంగా ఉలవ్వనూరులోని లోద్దిగండి వాగు పొంగిపొర్లడం ద్వారా ఇళ్లల్లోకి వరద నీరుచేరి సామగ్రి కొట్టుకుపోయి తీవ్రనష్ట వాటిల్లిందని బాధితులను అధికారులు ఆదుకునేవిధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, బరపటి వాసుదేవరావు, వాసం మంగయ్య, ముసలయ్య, శ్రీను, బాబు, ధార రమేష్, ఆకిరెడ్డి, సతీష్, జగదీష్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు సమర్పించారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

గ్రామాలకు బస్ సర్వీస్‌లు నడపాలి

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపోలో నూతన బస్‌లు ప్రవేశపెట్టాలని పల్లెలకు బస్ సర్వీస్‌లు నడపాలని కోరుతూ మాస్‌లైన్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు. ఆదివారం మండలంలోని ధర్మారం తండా, ముత్తారపు కట్ట, మసివాగులో సంతకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ నేతలు చంద్ర అరుణ, యదళ్లపల్లి సావిత్రి, ముత్తక్క, రమ, లక్ష్మి, సుజాత, వెంకటమ్మ పాల్గొన్నారు.

డ్రెయినేజీ లేక అవస్థలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రైటర్‌బస్తీ గొల్లగూడెంలో దశాబ్దాలుగా నివాసముంటున్న ఇళ్ల ప్రహరీలను నోటీసులు ఇవ్వకుండా అకారణంగా మున్సిపల్ వారు కూల్చివేశారు. దీంతో కూల్చివేతలు జరిగిన ప్రాంతంలో డ్రెయినేజీలు మూసుకపోయాయి. ప్రస్తుతం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీరు పోయే మార్గం లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. దీంతో స్థానికులు అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలకు మరమ్మతులు చేపట్టి నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇల్లెందులో 127శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వెల్లడించారు. ఆదివారం ఇల్లెందులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టులో సాధించిన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఆగస్టు నెలకు నిర్ధేశించిన లక్ష్యం 2.59 లక్షల టన్నులకు గానూ 3.29 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తిని చేసి 127 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. 0.03 లక్షల టన్నులు బొగ్గు రైలు మార్గం ద్వారా, 0.62 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 2.18 లక్షల టన్నులు మొత్తం 2.83 లక్షల బొగ్గు బట్వాడా చేసినట్లు చెప్పారు. ఆగస్టు నెలలో ఒక ర్యాకు ద్వారా బొగ్గు రవాణా చేశామని వివరించారు. ఇల్లెందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 14.39 లక్షల టన్నులకు గానూ 16.76 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 116 శాతం నిలిచినట్లు తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని వెలికి తీయాలని, అందుకు ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఏరియాను అగ్రస్థానంలో నిలిపిన ఉద్యోగులను, సూపర్‌వైజర్లను అధికారులను, యూనియన్ నాయకులను అభినందించారు.

తుది దశకు చేరిన జేకే ఓసీ విస్తరణ అనుమతులు

ఇల్లెందు జేకే ఓసీ విస్తరణ అనుమతులు తుది దశకు చేరాయని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. ఆదివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా అనుమతుల ప్రక్రియ సాగిందన్నారు. జేకే ఓసీలో 151 హెక్టార్ల ఫారెస్టు భూమి ఉందన్నారు. అయితే 20 ఏళ్ల క్రితం మూతపడిన జేకే ఓసీ సీతారాంపురం ప్రాంతంలో గల సింగరేణి భూమి అటవీశాఖకు అప్పగించినట్లు తెలిపారు. ఈ క్రమంలో అనుమతలన్నీ తుది దశకు చేరాయన్నారు. జేకే-5 ఓసీ పూర్తయిన తర్వాత దానిలో పంపు స్టోరేజీ ప్లాంట్ ద్వారా 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టేందుకు ప్రతిపాదించామని తెలిపారు.

సింగరేణి ఉద్యోగులకు పదోన్నతులు..

సింగరేణి ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగులకు సెప్టెంబర్ 1 నాటికి అర్హత కలిగిన వారికి కేడర్ స్కీం/ టైం బాండ్ ప్రమోషన్స్ ఇవ్వటం జరిగిందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. ఆదివారం జీఎం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 18 మంది ఉద్యోగులకు ప్రమోషన్స్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం జాన్‌ఆనంద్ మాట్లాడారు. ప్రతీ సంవత్సరం మార్చి/ సెప్టెంబర్‌లో కేడర్ స్కీం ప్రమోషన్స్ ఇవ్వటం జరుగుతుందన్నారు.

పల్లెల్లో ఘనంగా బోనాల వేడుక



జూలూరుపాడు: గుండెపుడిలో బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు



పాల్వంచ: ఊరేగింపుగా వస్తున్న భక్తులు

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. బొడ్రాయి (నాభిశిల), శ్రీముత్యాలమ్మ తల్లి, శ్రీకోటమైసమ్మతల్లి, శ్రీపెద్దమ్మతల్లి తదితర దేవతామూర్తులను ప్రజలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరివారిగూడెం, గుండెపుడి, వెంగన్నపాలెం, జూలూరుపాడు, అనంతారం, గుండ్లరేవు, పాపకొల్లు, కాకర్ల, పడమటనర్సాపురం తదితర గ్రామాల ప్రజలు గ్రామదేవతలకు బోనాలు నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

పాల్వంచ: పట్టణంలోని గాంధీనగర్‌లోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు బోనాలు ఎత్తుకుని మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించారురు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంగపురి నాగేశ్వరరావు, పూజారి గడ్డం భాస్కర్‌దాసు, కేసుపాక వెంకటేశ్వర్లు, రమేష్, పిలక రమేష్, సుందర్ రావు, సాంబశివరావు, ధర్మారావు, నాగమణి, అరుణ పాల్గొన్నారు.